క్లుప్తంగా

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెనమలూరు మండల, తాడిగడప మున్సిపాలిటీల్లో శుక్రవారం నుంచి జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల వైద్యాధికారి శ్రీనివాస్ గురువారం వివరాలు తెలిపారు. పెనమలూరు మండలంలో శుక్రవారం చోడవరం స్కూల్, ఈ నెల 12న గంగూరు సచివాలయం-1, 19న వణుకూరు సచివాలయం - 1, 23న పెనమలూరు సచివాలయం - 2, 30న గోసాల సచివాలయం -1 పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో శుక్రవారం కానూరు సచివాలయం - 1, 12న పోరంకి హైస్కూల్, తాడిగడప హైస్కూల్‌లో 19న, 27న యనమలకుదురు సచివాలయం - 1లో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవాగుణం స్ఫూర్తిదాయకం



ఉయ్యూరు: సమాజ ప్రగతిలో సేవాగుణం చూపేవారిని స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త బోరుకాటి ప్రసాదరాజు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు, రత్న గ్రూప్స్ ఆధ్వర్యంలో కాటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.2.20 లక్షలతో చేపట్టిన తాగునీటి వసతి, ఇంటర్నెట్ సదుపాయం, సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. రత్న గ్రూప్స్ అధినేత ప్రసాదరాజు, శ్యామలాదేవి దంపతులు కార్యక్రమంలో పాల్గొని వసతులను ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, హెచ్‌ఎం తలశిల రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు ప్రణాళికతో కృషి చేయాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: భవిష్యత్ లక్ష్యసాధనకై ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని జెడ్పీ హైస్కూల్‌లో మానవత ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా కెరీర్ గైడెన్స్ తరగతులను గురువారం నిర్వహించారు. విద్యతోనే సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగిపోతాయని చెప్పారు.
ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని ఆయన కోరారు. అనంతరం గతేడాది 6,7,8,9 తరగతుల్లో తొలి మూడు స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత తరుపున ప్రోత్సాహకంగా పెద్ద బాలశిక్ష పుస్తకం, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను పంపిణీ చేశారు. మానవత హనుమాన్ జంక్షన్ శాఖ అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, మానవత సీనియర్ సభ్యులు జన్యావుల సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: పాత గొడవల కారణంగా యువకుడిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం పెనమలూరు గ్రామం జెండా చెట్టు సెంటర్‌కు చెందిన షేక్.అబ్దుల్ రజాక్ హైస్కూల్ వద్ద ఉన్న వరుసకు సోదరుడు రసూల్ మెకానిక్ షాపులో పని చేస్తాడు. అయితే బుధవారం రసూల్ ఇంటి వద్ద బైక్ కడుగుతున్న సమయంలో బంధువు నాగూర్‌బాబు, అజారుద్దీన్‌లు వచ్చి పాత కక్షలతో అకారణంగా దాడి చేసి చంపుతానని బెదిరించారు. ఈ దాడిలో గాయపడిన రజాక్ ఇచ్చిన ఫిర్యాదుతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- వైఎస్సార్ పింఛన్ కానుకల పంపిణీ



కంకిపాడు సభలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. కంకిపాడు మండలంలో 9,343 వివిధ రకాల పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక చొరవతో జనవరి నుంచి 170 కొత్త పింఛన్లు అదనంగా మంజూరయ్యాయన్నారు. ప్రతి నెలా ఠంఛన్‌గా లబ్ధిదారులకు పింఛన్ అందేలా చర్యలు తీసుకున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయని చెప్పారు. సచివాలయాల ఏర్పాటుతో గ్రామంలోనే మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దేశ ప్రగతిలో పేదల శ్రమ, కష్టం దాగి ఉన్నాయన్నారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా జనవరి నుంచి రూ.3 వేలు పింఛను అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన 171 రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, వైస్ ఎంపీపీలు కలపాల ప్రకాష్, ధూళిపూడి కృష్ణకిషోర్, సర్పంచ్ బాకీ రమణ, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, డీఎల్‌డీఏ నాంచారరావు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ పి.ప్రసాద్, ధార్మిక పరిషత్ సభ్యుడు నారాయణరాజు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, నాయకులు నెరుసు సతీష్, బత్తుల కామేశ్వరావు, మాదు శ్రీహరిరాణి, బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో పేదల జీవితాల్లో వెలుగు

ఉయ్యూరు: పింఛన్ పెంపుతో పేదల జీవితాలకు భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పెంచిన పింఛన్ రూ.3 వేలు, నూతనంగా మంజూరైన కొత్త పింఛన్లను మున్సిపల్ చైర్మన్‌వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలేసురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో లబ్ధిదారులకు పింఛన్ అందించారు. మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ఆనందోత్సాహాలతో సాగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.



ఉయ్యూరులో కొత్త పింఛన్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని

అవ్వా తాతలకు అండగా జగనన్న

పెనమలూరు: అవ్వా తాతలకు అండగా జగనన్న పాలన ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్‌లు మంజూరు చేస్తోందని పెనమలూరు గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు అన్నారు. నూతన సంవత్సరంలో ప్రభుత్వం గ్రామంలో 34 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేసి ప్రసంగించారు. వైఎస్సార్ పింఛన్ కానుక అవ్వాతాతలకు, వితంతువులు, దివ్యాంగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రధానంగా సమాజంలో ఆదరణ లేని అవ్వాతాతలకు వైఎస్సార్ పింఛన్ కానుక ఆదుకుంటుందని తెలిపారు. జగనన్న ఇచ్చిన హామీ మేరకు నెల పింఛన్ రూ.3 వేలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో లబ్ధిదారులు జగనన్నకు అండగా ఉండి ఎన్నికల్లో గెలిపించి మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెనమలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

13 నుంచి పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 13వ తేదీ నుంచి సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా సంక్రాంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న పసుపు, కుంకుమ నూతన వస్త్రాల బహూకరణ అనంతరం పేరంటాలమ్మ పుట్టింటి నుంచి ఆలయానికి చేరుకుంటారన్నారు. 13న భోగి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడులు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14 మకర సంక్రాంతిన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, కుంకుమ పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. అదే రోజు సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తామన్నారు. 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి(ఊయల) సేవ, 20న ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా జరిగే గ్రామోత్సవానికి సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో క్యూలైన్లు, తాగునీటి వసతి, మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, భక్తులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మత్తె కిరణ్, యలమందయ్య, వేమినేని రజిత, పూజారి ఇనుగంటి లక్ష్మీనరసింహ శర్మ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ భాను ప్రదీప్, ఈఓ లోకేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యులు

8 వేల ఎకరాల్లో దాళ్వా సాగు



పి.నైనవరం(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలంలో ఈ ఏడాది దాళ్వా పంటలు 8 వేల ఎకరాల్లో సాగు చేశారని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. పి.నైనవరం గ్రామంలో దాళ్వావరి నాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. దాళ్వా వరి సాగు చేసేందుకు రైతాంగం ఆసక్తి చూపుతున్నారన్నారు. వరితో పాటు తెల్లజొన్న, అక్కడక్కడ మొక్కజొన్న, కూరగాయాలను కూడా సాగు చేస్తున్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఎలాంటి నీటి కొరత ఉండదని స్పష్టం చేశారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు ప్రోత్సాహం



కంకిపాడు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తోందని జేసీఎస్ మండల చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. కంకిపాడు పట్టణంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం క్రీడాకారులకు బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు బ్యాడ్మింటన్ బ్యాట్‌లను చిరంజీవి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ప్రధాన అనఘాష్టమి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత పంచతత్వ గురుపాదుకా మందిరంలోని శ్రీదత్తాత్రేయ స్వామికి విశేష పూజలు, హస్తా నక్షత్ర హోమం జరిపారు. అనంతరం 108 మంది దంపతులచే సామూహిక అనఘాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మార్గశిర మాస కృష్ణపక్ష అష్టమి రోజున జరిపే ఈ వ్రతానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. సమస్త చరాచర జీవకోటికి రక్షించేందుకు శ్రీఅనఘాస్వామి, అనఘాదేవిగా భూమిపై శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మీదేవి అవతరించారని తెలిపారు. ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించిన వారికి సకల శుభాలు పొందుతారని పండితులు శ్రీపాద, మారుతి, ప్రవీణ్ వివరించారు. ఆశ్రమం చైర్మన్ గొంది రాజశేఖర్, గ్రామ ప్రముఖులు మూల్పూరి మాధవన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దత్త దేవాలయంలో..

ఉయ్యూరు: మండలంలోని గండిగుంట దత్త దేవాలయంలో ప్రధాన అనఘాష్టమి వ్రతం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణతో భక్తులు వ్రతాన్ని ఆచరించి పూజలు చేశారు. లోకకల్యాణార్థం ఈ పూజా కార్యక్రమాలను జరిపించామని ఆలయ ట్రస్టీ మంజుల తెలిపారు. కార్యక్రమాన్ని పీఆర్వో నారాయణమూర్తి పర్యవేక్షించారు.



అనఘాష్టమి వ్రతం ఆచరిస్తున్న భక్తులు



అనఘాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

భవానీలకు అల్పాహారం పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గిరి ప్రదక్షిణ చేసే భవానీలకు అల్పాహారం, పాలు, పండ్లు పంపిణీ చేయడం అమ్మవారి సేవతో సమానంగా భావిస్తున్నామని చిట్టినగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు బత్తిన రాఘవ, రఘువీర్ తెలిపారు. భవానీల ఇరుముడులను పురస్కరించుకుని గిరి ప్రదక్షణ చేసే భవానీలకు బత్తుల లలితా ప్రసాద్ పేరిట సేవా కార్యక్రమాలను గురువారం నుంచి ప్రారంభించారు. కేటీ రోడ్డుపై ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ మూర్తికి రాఘవ, రఘువీర్ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం భవానీలకు అల్పాహార పంపిణీ చేశారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవారుజాము వరకు అల్పాహారం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. దీక్ష విరమణల చివరి మూడు రోజులు భవానీలకు అల్పాహారం, కాఫీ, టీలతో పాటు పండ్లను పంపిణీ చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఏటా భవానీలకు సేవ చేసుకునే భాగ్యం కలగడం చాలా సంతోషంగా ఉందని నిర్వాహకులు కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళల జీవనోపాధిపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): చైల్డ్ ఫండ్ ఇండియా హెచ్‌ఎస్‌బీసీ సహకారంతో వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట, వైఎస్సార్ కాలనీ, కండ్రికలలోని మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా జీవనోపాధి పొందేందుకు గురువారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో అవగాహన కార్యక్రమం జరిగింది. 1,210 మంది మహిళలకు రూ.12 వేలు చొప్పున అందచేసి చిరువ్యాపారాలు చేసుకునేందుకు సహకరించారు. వారి వ్యాపారాభివృద్ధి కోసం నిర్వహించిన 18 రోజుల శిక్షణలో వ్యాపార పరిజ్ఞానం, నెట్ వర్కింగ్, లింకేజీలు అంశాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ ఫండ్ ఇండియా సీనియర్ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి తమ సంస్థ సహకారం అందిస్తోందన్నారు.

ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు సమన్యాయం చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో మాదిగలకు న్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు కోరారు. విజయవాడ ఐలాపురం హోటల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15 సీట్లు మాదిగ, మాదిగ ఉప కులాలకు కేటాయించాలని కోరారు. మాదిగల జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలను మాలలకు కాకుండా మాదిగలకే కేటాయించాలన్నారు. ఈ ప్రభుత్వంలో సీట్ల కేటాయింపులో మాదిగలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 20వ తేదీన వైఎస్సార్ కడప మున్సిపల్ గ్రౌండ్‌లో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మాదిగల రాజకీయ సమన్యాయ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కుందుర్తి సుబ్బారావు, ఎంఈఎఫ్ అధ్యక్షులు వరదరాజులు జాతీయ నాయకుడు ఏసు పోగు బాబు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు మంద నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రూప్ - 1 ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే పార్థసారథి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, పక్కన తోట శరత్‌చంద్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): బలహీనవర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం విజయవాడ శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో ఉచితంగా ఇస్తున్న ఏపీపీఎస్సీ గ్రూప్ 1 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పెనమలూరు శాసన సభ్యులు కొలుసు పార్థసారథి అన్నారు. గ్రూప్ 1 ఉచిత శిక్షణకు సంబంధించి శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ముద్రించిన పోస్టర్‌ను గురువారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్‌లు జారీ చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ కూడా గ్రూప్ 1 పరీక్షను సివిల్స్ స్థాయిలో పెట్టడం, నోటిఫికేషన్లను అనుకున్న సమయంలోనే పారదర్శకంగా పూర్తి చేస్తూ, మిగిలిన రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని యువతకు అవసరమైన శిక్షణ తన సొంత ఖర్చుతో ఉచితంగా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాల్లో సహాయం చేయడానికి తామెప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ తమ అకాడమీలో గత మూడు సంవత్సరాల్లో 98 కిపైగా గ్రూప్ 1 ర్యాంకులు వచ్చినట్లు తెలిపారు. గ్రూప్1 పరీక్ష కూడా ఐఏఎస్ తరహాలో జరుగుతుందని ఆయన తెలిపారు.

'హిట్ అండ్ రన్' చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయతలపెట్టిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆల్ ఆంధ్రా లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబురావు, షేక్ మసూద్ ఆలీ డిమాండ్ చేశారు. స్థానిక విజయవాడరోడ్డులోని అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీ డ్రైవర్లు, క్లీనర్లు గురువారం శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. 'హిట్ అండ్ రన్' చట్టంతో లారీ డ్రైవర్ల జీవితాలు అంధకారంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ అసోసియేషన్ తరుపున వినతి పత్రాన్ని పంపుతున్నట్లు చెప్పారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



కేకు కట్ చేస్తున్న ఎంఈఓ రవికుమార్

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో గురువారం బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా వరల్డ్ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కె.రవి కుమార్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చూపులేనివారు విద్యను అభ్యసించడం కోసం బ్రెయిలీ కనిపెట్టిన లిపి అంధుల పాలిట వరంగా మారిందన్నారు. ఈ లిపి వల్ల అంధులు తమంతట చదవడం, రాయడం చేయగలరని పేర్కొన్నారు. బ్రెయిలీ సృష్టించిన లిపి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ముఖ్యంగా భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీపీఆర్టీయూ సేవాదళ్ అధ్యక్షుడు డి.శ్రీను నేతృత్వంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సిల్వర్‌జూబ్లీ పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాకీరా సుల్తానాకు ఘన సన్మానం



జాకీరా సుల్తానాను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద నవ భారత్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానాకు సావిత్రీబాయి పూలే ప్రతిభ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆమెను స్థానిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయినీ సావిత్రీబాయి పూలే అవార్డును స్వీకరించిన ఆమె సేవలను కొనియాడారు. విద్యా రంగంలో గడచిన రెండు దశాబ్దాలుగా విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ, సామాజిక సేవా రంగంలో సైతం తనదైన ముద్ర వేశారని విజయవాడ చిల్డ్రన్స్, స్కూల్స్ అండ్ టుటోరియల్స్ అసోసియేషన్ గవర్నింగ్ బాడీ సభ్యుడు తాళ్లూరి శ్రీనివాసరావు కొనియాడారు. కరస్పాండెంట్ షేక్ ఇమామ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సారె సమర్పణ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో నిర్వహించనున్న ఈశ్వరిదేవి ఆరాధన మహోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివెళ్లారు. గురువారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సారెను కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ సత్యనారాయణపురంలోని విశ్వబ్రాహ్మణ మహిళ సంఘాన్ని సందర్శించి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో ఈశ్వరిదేవి అమ్మవారి ఆరాధనకు పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి సారె సమర్పించడం ఎంతో పుణ్యకార్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడడంతో విద్యార్థికి గాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బండారుగూడెం - తేలప్రోలు రోడ్డులో రొయ్యల ఫ్యాక్టరీ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. హనుమాన్ జంక్షన్‌కు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న బండారుగూడెం గ్రామానికి చెందిన బెజవాడ సూర్య ఆటోలో పాఠశాలకు వెళ్తుండగా గురువారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. విద్యార్థి సూర్య తల, ముఖంపై బలమైన గాయాలు కావటంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు హుటాహుటిన విద్యార్థిని విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.